క్లుప్తంగా

పార్టీ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన



జగ్గంపేటలో పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: స్థానిక బాలాజీ నగర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తల సౌకర్యార్థం అన్ని వసతులతో కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు తోట బాబ్జి, గఫూర్, జగాల్, కాపారపు ప్రసాద్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

తొండంగి: అన్నవరంలోని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ధర్మవరంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మనబడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని మండల విద్యాశాఖ అధికారి వి.రాజబాబు అన్నారు. మండలంలోని ధర్మవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయా ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ రాజబాబు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం



సత్యనారాయణస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం: స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతిదేవి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధనం నిర్వహించారు. సుమారు ఆరు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వరసాల ప్రసాద్, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఐనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

పిఠాపురం: కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట తీర ప్రాంతంలో సారా బట్టీలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు తెలిపారు. సారా తయారీ దారులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సారా తయారీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్కచెల్లెమ్మలకు అండగా..

- మహిళలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు
- ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు
- చేయూత పథకం ద్వారా 14,785 మందికి రూ.55.88 కోట్ల మేర లబ్ధి
- ఆసరా పథకంలో 40,720 మందికి ప్రయోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఆసరా పథకం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా (ఫైల్)

తుని: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. పేద మహిళలను రోజంతా కష్టపడినా పూట గడవని పరిస్థితి నుంచి సొంతంగా చిరు వ్యాపారాలు చేసుకునే స్థాయికి ప్రభుత్వం ప్రోత్సహించింది. తుని నియోజకవర్గంలో వైఎస్సార్ చేయూత పథకంలో 14,785 మంది మహిళలకు నాలుగున్నర ఏళ్లలో రూ.55.88 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. ఆసరా పథకంలో 40,720 మందికి రూ.106.58 కోట్లు ప్రయోజనం పొందారు. మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించారు. మహిళలు ఒకప్పుడు డ్వాక్రా రుణాలు తీసుకుని వాటితో కుటుంబాలకు చేదోడుగా నిలిచారు. ధరలు పెరుగుదల, కుటుంబ వ్యయం పెరగడంతో ఆదాయం పెంచుకునేందుకు బ్యాంకులు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసినా వచ్చిన ఆదాయం వడ్డీలకే సరిపోయేది. ఇది గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకానికి రూపకల్పన చేశారు. 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ.18,500 చొప్పున నేరుగా బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. నాలుగేళ్లలో ప్రతి మహిళకు రూ.74 వేల లబ్ధి చేకూరింది. దీంతో మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించారు.

నియోజకవర్గంలో ఇలా..

తుని నియోజకవర్గంలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాలతో పాటు తుని పట్టణంలో వైఎస్సార్ చేయూత పథకానికి 14,785 మందిని ఎంపిక చేశారు. తుని మండలంలో 5,734 మంది, తొండంగి 6,259 మంది, కోటనందూరు 288 మంది, తుని పట్టణంలో 2,504 మంది ప్రయోజనం పొందారు. ఇందులో ఎక్కువ మంది కూరగాయలు, టిఫెన్ సెంటర్లు, పాన్‌షాపులు, కిరాణా, ఫ్యాన్సీ, పండ్లు వ్యాపారాలు, విస్తరాకుల తయారీ తదితర యూనిట్లను సొంతంగా పెట్టుకున్నారు. వైఎస్సార్ చేయూతతో పాటు ఆసరా, వడ్డీలేని రుణాలు ద్వారా అదనంగా ఆర్థిక భరోసా కలిగింది. గత ప్రభుత్వాలు చేయలేని పనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగినందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చేయూత పథకం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
తుని మండలం	5,734	24.95
తొండంగి	6,259	18.64
కోటనందూరు	288	1.33
తుని పట్టణం	2,504	10.96
మొత్తం	14,785	55.88

ఆసరా పథకం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
తుని మండలం	17,987	61.77
తొండంగి	14,844	26.40
కోటనందూరు	597	1.51
తుని పట్టణం	7292	16.90
మొత్తం	40,720	106.58

సొంతంగా టిఫిన్ సెంటర్



పేద కుటుంబం కావడంతో మేము ఇద్దరం కష్టపడినా కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. డ్వాక్రా సంఘంలో తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో జగన్‌బాబు ప్రభుత్వం వచ్చింది. డ్వాక్రా రుణాన్ని మాఫీ చేసింది. ఆసరా పథకంలో రూ.72,000 వచ్చాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకంలో నాలుగేళ్లకు రూ.74,000 ఇచ్చారు. ఆ సొమ్ములతో గొల్లపేటలో టిఫిన్ సెంటర్ పెట్టుకున్నాను. ప్రైవేటు వ్యాపారుల దగ్గర రుణాలు తీసుకోవడం మానేశాను. ఆసరా, చేయూత పథకంలో వచ్చిన సొమ్ముతో సొంతంగా వ్యాపారం చేసి వచ్చిన లాభంతో ఆనందంగా ఉన్నాం.

– నాళం వెంకటలక్ష్మి, లబ్ధిదారు, తుని

కూరగాయల వ్యాపారం ప్రారంభించాను



మా లాంటి పేదల జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారు. మాది పేద కుటుంబం కూలీ పనికి వెళితేనే పూట గడిచేది. నేను ప్రకాశ్ అంబేడ్కర్ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. సొంతంగా వ్యాపారం చేసుకుందామని బ్యాంకు రుణం కోసం ప్రయత్నించాను. ఈ సమయంలోనే ఆసరా పథకం వచ్చింది. ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.48 వేలు, చేయూత పథకంలో రూ.18,500 చొప్పున రూ.74,000 వచ్చాయి. ఈ సొమ్ముతో వీరవరపుపేటలో కూరగాయల దుకాణం పెట్టాను. రైతు బజారుకు వెళ్లి కూరగాయలు కొనుక్కొచ్చి వాటిని అమ్మడం ద్వారా పెట్టుబడి పోయి ఆదాయం వస్తోంది. ప్రస్తుతం మా కుటుంబం ఆనందంగా ఉంది. మాకు ఇంతటి మంచి చేసిన సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాను.

– ఉర్ల నాగమణి, లబ్ధిదారు, తుని

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



జి.కొత్తపల్లిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు


శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో పల్లా మంగ, పల్లా శివ, గింజాల సుజాత, గింజాల మంగ తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన బాబ్జి, మామిడి శ్రీను, ఈగల రాజు, ఎడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తొండంగి: మండలంలోని దానవాయిపేట బీచ్ రోడ్డులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అగ్నిహోత్రం రంగాచార్యులు, శంకరంబం వెంకట్రాజుశర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం, కోలాటం, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ మడదా ప్రభాకరరావు తెలిపారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- బీబీ పట్నంలో ఎన్నికల ప్రచారం



బీబీ పట్నంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని బీబీ పట్నంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, అవన్నీ కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివానం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, సర్పంచ్ వడ్లమ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకి నాని, కాకి చిట్టిబాబు, సర్పంచులు సర్నం శ్రీనివాస్, రాపర్తి రామకృష్ణ తదితులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం

శంఖవరం: ఐదేళ్ల పాటు సంక్షేమ పాలన అందించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం ఆయన గడపగడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు, గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనకు చంద్రబాబు పాలనకు తేడా గమనించాలని ప్రజలను కోరారు. పేదలు, మహిళల అభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు, పార్టీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ ఎడ్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు కోన బాబ్జి, ఈగల రాజు, ఈగల గంగ, ఆచంట వెంకటేశ్వరరావు, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- గుర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం



గుర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి

జగ్గంపేట: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. మండలంలోని గుర్రంపాలెంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని భారీ మెజారీతో గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు గఫూర్, షేక్ బాబ్జీ, అబ్బిరెడ్డి వీరబాబు, చీపురపల్లి రాఘవ, గ్రామ సర్పంచ్ చీపురపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం

- ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో పార్టీ శ్రేణులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో శుక్రవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తమ స్వలాభం కోసం పార్టీ మారినా వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీలో ఎటువంటి అవినీతి జరిగినా సహించే పరిస్థితి లేదన్నారు. అవినీతి రహిత పాలనే లక్ష్యంగా పని చేస్తున్నట్టు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనే ప్రత్తిపాడులో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపిస్తుందన్నారు.

మేమంతా వరుపుల వెంటే..

వచ్చే ఎన్నికల్లో తామంతా నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు వెంటే ఉన్నామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉద్ఘాటించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్‌తో పాటు మరికొంత మంది పార్టీ వీడినా ఎటువంటి నష్టం లేదన్నారు. తామంతా వరుపుల వెంటే ఉన్నామని ఆయన విజయమే కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. నగర పంచాయతీలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, తొండారపు రాంబాబు, పైల విజయ్‌కుమార్, మసిరపు నాగేశ్వరరావు, వాగు బలరామ్, దేగల వెంకటరమణ, జువ్విన వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుపై పంచాయతీ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎంసీసీ కన్వీనర్, పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద సిబ్బందితో ఆమె మాట్లాడుతూ కోడ్ అమలును సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ బూత్‌ల నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో కోడ్ అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘన జరిపితే సహించేది లేదన్నారు. గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఉంటే వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

నిబంధనలు పాటించాలి

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. పట్టణ పరిధిలో ఎంఈఓ వై.శివరామకృష్ణ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా, మండల పరిధిలో ఈఓపీర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ప్రస్తుత పెళ్లిళ సీజన్‌లో వెంట నగదు, బంగారం తీసుకు వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



ఏలేశ్వరంలో శిలువ మోస్తున్న క్రీస్తు పాత్రధారి

ఏలేశ్వరం: ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజును పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గవ్యాప్తంగా గుడ్ ఫ్రై డే (శుభ శుక్రవారం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరంలో ఆర్‌సీఎం చర్చి నుంచి ఏసుక్రీస్తు వేషధారి శిలువను మోస్తూ ఊరేగింపు నిర్వహించారు. పాస్టర్ థామస్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి నుంచి మెయిన్ రోడ్, మార్కెట్ రోడ్, బాలాజీ చౌక్, హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు సాగింది. స్థానిక కాలేజ్ రోడ్‌లోని లూథరన్ చర్చిలో పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో పేకల జాన్, ఉదయ్ కుమార్, వాసా అనూష, ఎస్ పల్లవి, బళ్ల శిరోమణి తదితరులు పాల్గొన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలోని సిరిపురం, చిన్నింపేట గ్రామాల్లో మనం ఫౌండేషన్ చైర్మన్ మనూరి లత ఆధ్వర్యంలో రొట్టెలు పంపిణీ చేశారు.

జగ్గంపేట: మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ జొన్నకూటి రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రాజు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

విశ్వాసానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

తుని రూరల్: విశ్వాసానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని హంసవరం ఆరోగ్యమాత ఆర్‌సీఎం చర్చ్ పాస్టర్ బాల శౌరి అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో క్రైస్తవులు శిలువలతో ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషధారణలో కళాకారుడిని సిలువపై ఉంచి కొట్టే ఘటనను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తొలుత ఆరోగ్యమాత ఆర్‌సీఎం చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు చరిత్రను, గుడ్ ఫ్రైడే విశిష్టతను పాస్టర్లు వివరించారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కిర్లంపూడిలో క్రైస్తవులు శిలువతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు స్టీఫెన్, పులుగు రాజు సంఘస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో...

గోకవరం: నియోజకవర్గంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక తంటికొండకు వెళ్లే మార్గంలో ఉన్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చి, రంపయర్రంపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, దాసరి రమేష్ దంపతులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న ఏసుక్రీస్తుకు శిలువ వేసే దృశ్యం



కిర్లంపూడి సెంటర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



హంసవరంలో శిలువలు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



జగ్గంపేట సెయింట్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రాజు